

## అహం అంటని మనిషి

ఎంత ఉన్నతస్థితికి చేరుకున్నా రఫీ ఏనాడు అహం ప్రదర్శించేవాడు కాదు. ఆయన వ్యక్తిత్వానికి అద్దంపట్టే సందర్భమే ఇది. ఒకసారి డార్జిలింగ్ సమీపంలోని సిలిగుడిలో బాలీవుడ్ స్టార్లు రెండు రోజుల కాన్సర్ట్ నిర్వహించారు. మొదటిరోజు రఫీ సంగీత విభావరి, రెండో రోజు మరోగాయకుడి కచేరీ ఏర్పాటు చేశారు. మొదటి రోజు కార్యక్రమం దిగ్విజయంగా పూర్తయింది. మర్నాడు రఫీ ముంబయికి వెళ్లాలి. అనుకున్నట్టుగానే ఉదయాన్నే దగ్గర్లోని విమానాశ్రయానికి బయల్దేరాడు. రఫీ వెళ్లిన కాసేపటికి రెండో రోజు కాన్సర్ట్‌లో పాల్గొనాల్సిన గాయకుడు రావడం లేదని కబురు అందింది. అమితాబ్ మరికొందరు హీరోలు ఆగమేఘాల మీద ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అప్పటికే రఫీ విమానం ఎక్కేశాడు. ఫ్లయిట్ బయల్దేరడానికి సిద్ధంగా ఉంది. ఏటీసీ అధికారులను బతిమాలి అమితాబ్ పరుగున విమానం దగ్గరికి చేరుకున్నాడు. లోపలికి వెళ్లి రఫీతో విషయం చెప్పాడు. మరుక్షణం కుర్చీలోంచి లేస్తూ.. 'చలో జాయేంగే బాబా' అంటూ విమానం దిగాడు. రెండోరోజు కాన్సర్ట్‌నూ విజయవంతం చేశాడు.


సబబు కాదనిపించింది హమీద్‌కి. చలో ముంబయి అన్నాడు. తనలో సంగీతజ్ఞుణ్ని చూసిన హమీద్ మాట రఫీకి వేదవాక్కు. సరే అన్నాడు. 1944లో ఇద్దరూ ముంబయిలో దిగారు. భిండీ బాజార్‌లో ఓ ఇరుకు గది అద్దెకు తీసుకున్నారు. అప్పటికే ముంబయికి వచ్చిన శ్యామ్‌సుందర్‌ను కలిశాడు రఫీ. అతనే హిందీలోనూ రఫీకి మొదటి అవకాశం ఇచ్చాడు. 'గావ్‌c కీ గోరీ' సినిమాలో పాట పాడించాడు. ఆ తర్వాత పెద్దగా అవకాశాలు రాలేదు. కోరస్ సింగర్‌గా తన ప్రతిభ చాటుకుంటూనే.. లీడ్ గాయకుడిగా ప్రయత్నాలు ముమ్మరం చేశాడు.

ప్రతిభ చాలామందిలో ఉంటుంది. అణకువ ఉన్నవారిలోనే అది మరింతగా రాణిస్తుంది. రఫీ విషయంలోనూ అదే జరిగింది. ఎంత ఎత్తుకు ఎదిగినా ఆ మనిషి తన మూలాలను మర్చిపోలేదు. ఒకరికి ఇబ్బంది కలిగించిన దాఖలాల్లేవు. ఒకరివల్ల ఇబ్బందైనా పట్టించుకున్న సందర్భాలూ లేవు. రఫీ కోరస్ సింగర్‌గా కొనసాగుతున్న రోజులవి. ఓ రోజు నౌషాద్ సాబ్ రికార్డింగ్‌కు వెళ్లాడు. ఏదో కారణం వల్ల ఆ రోజు రికార్డింగ్ రద్దయింది. అందరూ వెనక్కి వెళ్లిపోయారు. రఫీ మాత్రం దిగాలుగా అక్కడే మెట్ల దగ్గర అటూ ఇటూ తచ్చాడుతున్నాడు. ఇంతలో అటుగా వచ్చాడు నౌషాద్. రఫీని చూడగానే.. అమాంతం కౌగిలించుకునేంత మైత్రి కుదరలేదు అప్పటికి! కనీసం రఫీ కోరస్ బృందంతో పాడటానికి వచ్చాడని కూడా నౌషాద్‌కు తెలియదు. 'ఏం బాబు.. ఎవరు నువ్వు?' అన్నాడు. 'కోరస్ కోసం వచ్చాను' అన్నాడు రఫీ. 'ఈ రోజు రికార్డింగ్ క్యాన్సిల్ అయిందిగా! రేపు వద్దువు' అన్నాడు. రఫీ ముఖం మరింత దిగాలుగా మారిపోవడం గమనించాడు. 'ఏమైనా కావాలా?' అని అడిగాడు. రఫీ మొహమాటంగానే 'రికార్డింగ్ వాయిదా పడుందని అనుకోలేదు. వెనక్కి వెళ్లడానికి నా దగ్గర డబ్బులు లేవు' అన్నాడు. నౌషాద్ జాలిగా చూస్తూ... ఓ రూపాయి అతని చేతిలో ఉంచాడు.

రోజులు దొర్లిపోయాయి. ఏండ్లు గడిచిపోయాయి. అవకాశాల కోసం స్టూడియోల చుట్టూ తిరిగిన రఫీ ఇంటికే దర్శక, నిర్మాతలు క్యూ కట్టడం మొదలైంది. 'మాకు నువ్వే పాడాలి' అని హీరోలు కోరడమూ జరిగిపోయింది. ఓ రోజు రఫీ ఇంటికి నౌషాద్ వచ్చాడు. హాల్‌లో కూర్చున్నాడు. గదంతా పరికించి చూస్తున్నాడు. అద్దాల అల్మారాల్లో అమరిన జ్ఞాపికలు వినమ్రంగా నౌషాద్‌ను పలకరించాయి. వాటి మధ్యలో ఓ చిన్న ఫొటోఫ్రేమ్. అందులో ఓ రూపాయి బిళ్ల. దాన్ని ఆశ్చర్యంగా చూస్తూ.. 'ఏమిటిది?' అన్నాడు రఫీ వైపు తిరిగి! 'మీరిచ్చిందే..' అని గతాన్ని గుర్తుచేశాడు. 'ఎందుకిలా?' అని మళ్లీ ప్రశ్నించాడు. 'నేనెంటో ఈ రూపాయి నాకు ఎప్పుడూ గుర్తు చేస్తుంది' అన్నాడు రఫీ. నౌషాద్ పొంగిపోయాడు.

## ఔర్ మీఠా..

రఫీకి మధుమేహం ఉంది. ఏ ఆకర్షణలకూ లోనుకాని ఆయన మిఠాయి విషయంలో ఆగలేడు. అదే ఆయన ఆరోగ్యాన్ని దెబ్బతీసిందని చెబుతారు. పాట రికార్డింగ్‌కు ముందు స్వీటు తినడం రఫీకి రివాజు. ఎస్డీ బర్మన్ అయితే.. రఫీ రికార్డింగ్ ఉందంటే.. క్యారెట్ హల్వా సిద్ధంగా ఉంచేవాడట. 'మీకు షుగర్ ఉందని మర్చిపోకండి' అంటూ గుర్తుచేస్తే... 'మీఠా ఖాయేతో.. ఆవాజ్ ఔర్ మీఠా ఆయేగా' అనేవాడట రఫీ!



## తుది శ్వాస వరకూ

తుదిశ్వాస వరకూ రఫీ పాడుతూనే ఉన్నాడు. 1980 జూలై 31 ఉదయం లక్ష్మీకాంత్-ప్యారేలాల్ సంగీత నిర్దేశంలో పాట పాడాలి. ఒక పల్లవి, చరణం రికార్డింగ్ అయింది. ఇంటికి బయల్దేరుతున్న రఫీ ఎందుకో ఆగి 'రెండో చరణమూ ఇప్పుడే పూర్తి చేద్దాం' అన్నాడట. వెనక్కి వచ్చి పాట పూర్తి చేసి ఇంటికి వెళ్లాడు. ఆ రాత్రే రఫీకి గుండెపోటు వచ్చి తుదిశ్వాస విడిచాడు. 'ఆస్‌పాస్' సినిమాలోని ఆ పాటతో రఫీ పాటల ప్రయాణం ముగిసింది. లక్ష్మీకాంత్-ప్యారేలాల్ ద్వయం సంగీతం అందించిన మొదటి పాట పాడింది రఫీనే! అప్పుడు వాళ్లు రఫీకి వెయ్యి రూపాయలు పారితోషికంగా ఇచ్చారట వాళ్లు. ఆ వెయ్యికి మరో రెండు రూపాయలు జతచేసి ఇద్దరికీ చెరో రూ.501 ఇచ్చి 'జంటస్వరాల్లా కలిసే ఉండండి..' అని ఆశీర్వదించాడట. ఆయన చివరి పాటకు వాళ్లే సంగీతం అందించడం కాకతాళీయమో, రుణానుబంధమో! అప్పుడు రఫీకి 55 సంవత్సరాలు.

రఫీ బాలీవుడ్‌ను ఏలడానికి ప్రధాన కారణం అతని అద్భుతమైన గళమే! రఫీ రాకకు ముందు ప్లేబ్యాక్ విధానం చాలా పరిమితంగా ఉండేది. చాలామంది హీరోలు ఎవరికి వారే పాడుకునేవారు. ప్లేబ్యాక్ విధానం వచ్చిన తొలినాళ్లలో రఫీ గళమెత్తాడు. హీరో మాటతీరు, హావభావాలు, పాత్ర తీరుతెన్నులను గమనించేవాడు. పాటను, పాత్రను, దాన్ని పోషిస్తున్న నటుణ్ని ఆకళింపు చేసుకొని ఒక్కో హీరోకు ఒక్కోవిధంగా గొంతు సవరించేవాడు. దిలీప్ కుమార్ ఫుల్ ఖుషీ.. దేవానంద్ ఆనందానికైతే అవధుల్లేవ్! షమ్మీ మరింతగా ఊగిపోయాడు!! ఒకరేమిటి మనోజ్‌కుమార్, ధర్మేంద్ర, రాజ్‌కుమార్ ఇలా బాలీవుడ్ తొలి రెండు తరాల హీరోలంతా ఎంత పుణ్యం చేసుకున్నామో అని సగర్వంగా భావించారు. ఎందుకంటే ఈ హీరోలందరూ రఫీ గాత్రాన్ని అరువు పొందినవాళ్లే! రేడియోలో రఫీ పాట వస్తుంటే.. అది ఏ హీరో మీద పిక్చరైజ్ చేసిందో చెప్పేసేవాళ్లు శ్రోతలు. అంతెందుకు జానీ వాకర్, మహమూద్ వంటి కామెడీ యాక్టర్లకూ వారి శైలిలో పాటలు పాడి ఆశ్చర్యచకితుల్ని చేశాడు ఈ మహా గాయకుడు.

పాటలో పదబంధాలకు రఫీ పలికించే డైనమిక్స్ అనితర సాధ్యం. దేవానంద్ మీద చిత్రీకరించిన 'అభీ నా